క్లుప్తంగా

కొనుగోలు కేంద్రాలను ఉపయోగించుకోండి

మార్కాపురం: మార్కాపురం మార్కెట్ యార్డులో ఏపీ మార్క్‌ఫెడ్, నాఫెడ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కందులు, శనగల కొనుగోలు కేంద్రాన్ని రైతులు ఉపయోగించుకోవాలని ఏఓ దేవిరెడ్డి శ్రీనివాసులు ఆదివారం ఓ ప్రకటనలో సూచించారు. క్వింటా కందులకు రూ.7,550, శనగలకు రూ.5,650 మద్దతు ధరతో కొనుగోలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. రైతులు, తాము పండించిన పంట ఉత్పత్తులను కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలని కోరారు.

వెంకటాపురం తండాలో వైద్య శిబిరం



వైద్య పరీక్షలు చేస్తున్న రమణారెడ్డి

గిద్దలూరు రూరల్: భగవాన్ శ్రీ సత్యసాయి జన్మదినాన్ని పురస్కరించుకుని మండలంలోని వెంకటాపురంతాండా గ్రామంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. 50 మంది తండా వాసులకు డాక్టర్ రమణారెడ్డి వైద్య పరీక్షలు చేశారు. సత్యసాయి సేవా సమితి అధ్యక్షుడు ఎస్.అనంతరామయ్య, సభ్యులు అన్నా గోపాల్, భిక్షం, శింగరి ప్రసాద్, ఓబులేసు, శశికళ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ప్లాస్టిక్ కవర్లు వాడితే చర్యలు



ఓ దుకాణంలో ప్లాస్టిక్ కవర్లు స్వాధీనం చేసుకుంటున్న మున్సిపల్ సిబ్బంది

మార్కాపురం టౌన్: మార్కాపురం మున్సిపాలిటీ పరిధిలో దుకాణాల యజమానులు, ఇతర వ్యాపారులు ప్లాస్టిక్ కవర్లు వినియోగిస్తే జరిమానా విధిస్తామని కమిషనర్ నారాయణరావు హెచ్చరించారు. ఆదివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ.. ప్లాస్టిక్ కవర్లు వినియోగించకుండా దుకాణదారులు, చిరు వ్యాపారులకు అవగాహన కల్పిస్తున్నామని చెప్పారు. ప్రజలు కూడా దుకాణాలకు, మార్కెట్‌కు వచ్చేటప్పుడు క్లాత్ బ్యాగ్స్, జూట్ బ్యాగులు తెచ్చుకోవాలని సూచించారు. టీ షాపుల్లో కూడా పేపర్, ప్లాస్టిక్ కప్పులను వాడవద్దని స్పష్టం చేశారు.

పసుపు సాగులో జాగ్రత్తలు పాటించాలి



రైతులకు సూచనలిస్తున్న విష్ణుప్రియ

గిద్దలూరు రూరల్: పసుపు పంట సాగులో రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఉద్యానవనశాఖ అధికారి విష్ణుప్రియ సూచించారు. మండలంలోని బురుజుపల్లె గ్రామంలో సాగు చేసినప పసుపు పంటను ఆదివారం ఆమె పరిశీలించారు. పసుపు మొక్కలు బాగా ఎండి నేలపై వాలినప్పుడు పంట కోతకు సిద్ధమైనట్లుగా భావించాలని చెప్పారు. పంటను తవ్వే రెండు రోజుల ముందు కాండాలను భూమట్టానికి కోసివేయాలని, తేలికపాటి నీటి తడి అందించిన రెండు రోజుల తర్వాత తవ్వకం ప్రారంభించాలని సూచించారు. పసుపు రైతులకు ఎటువంటి సందేహాలు ఉన్నా తనను సంప్రదించాలని సూచించారు.

కోటసత్యమాంబదేవికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో కోటసత్యమాంబదేవి

బేస్తవారిపేట: మండలంలోని గొట్టమిండ్ల సమీపంలోని కోటసత్యమాంబదేవి, బేస్తవారిపేట, పాపాయిపల్లెలో పోలేరమ్మ ఆలయాల్లో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. కోటసత్యమాంబదేవి ఆలయంలో అమ్మవారిని, సత్యమణికంఠేశ్వరుడిని ప్రత్యేకంగా అలంకరించి అభిషేకాలు, కుంకుమ పూజలు చేశారు. భక్తులు అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించారు.

యమపాశాలు!

- కిందకు వేలాడుతున్న విద్యుత్ తీగలు
- ఒరిగి ప్రమాదకరంగా ఉన్న స్తంభాలు
- విద్యుత్‌శాఖలో వేధిస్తున్న సిబ్బంది కొరత
- రైతులకు తప్పని తిప్పలు.. పట్టించుకోని అధికారులు

కంభం:

అన్నదాతల జీవితాల్లో వెలుగులు నింపాల్సిన విద్యుత్ తీగలు యమపాశాలై కాటేసేందుకు సిద్ధంగా ఉన్నాయి. కరెంటు తీగలు ఎప్పుడు తెగిపడతాయో, ఒరిగిన స్తంభాలు ఏ క్షణం విరిగి పడతాయో తెలియని పరిస్థితి. కంభం మండలంలోని పలు గ్రామాల్లో విద్యుత్ లైన్‌మెన్ల సమస్య వేధిస్తుండటంతో ప్రజలతోపాటు రైతులు ఇబ్బంది పడుతున్నారు.

ప్రమాదకరంగా స్తంభాలు, తీగలు

కంభం పట్టణంలోని చౌక్ సెంటర్, జామియా మసీదు సెంటర్, మెయిన్‌బజారు.. ఇలా పలు చోట్ల విద్యుత్ తీగలు కిందకు వేలాడుతూ ప్రమాద ఘంటికలు మోగిస్తున్నాయి. స్తంభాలు, తీగలపై చిల్లచెట్లు పెరిగి ప్రమాదకరంగా మారుతున్నాయి. రామాలయం వీధి, పార్కువీధి, చౌక్‌సెంటర్‌లలో ఉన్న పాత ఇనుప విద్యుత్ స్తంభాలు ప్రమాదకరంగా ఉన్నాయి. వర్షాలు పడినప్పుడు స్తంభాలు షాక్ కొడుతున్నాయని స్థానికులు చెబుతున్నారు. కంభం చెరువు మార్గంలోని అరటి తోటల మీదుగా వెళ్తున్న విద్యుత్ తీగలు, యర్రబాలెం, తెల్లదిన్నె, తురిమెళ్ల గ్రామాల్లోని పంట పొలాల్లో ఒరిగిన విద్యుత్ స్తంభాలు ప్రమాదకరంగా మారాయి. కొన్నిచోట్ల వీధుల మధ్యలో విద్యుత్ స్తంభాలు అడ్డంగా ఉన్న అధికారులు పట్టించుకోవడం లేదని స్థానిక ప్రజలు వాపోతున్నారు.

వేధిస్తున్న సిబ్బంది కొరత

మండలంలో మొత్తం 16 మంది రెగ్యులర్ లైన్‌మెన్లకుగాను ప్రస్తుతం 12 మంది మాత్రమే విధుల్లో ఉన్నారు. వీరితో పాటు ఐదుగురు ఎనర్జీ అసిస్టెంట్లు పనిచేస్తున్నారు. కంభం రూరల్, జంగంగుంట్ల, యర్రబాలెం, పెద్దనల్లకాల్వ, రావిపాడు సబ్‌స్టేషన్ల పరిధిలో లైన్‌మెన్లు లేక పోవడంతో ఆ గ్రామాల ప్రజలు రైతులు ఇబ్బంది పడుతున్నారు. జంగంగుంట్లకు గతంలో ఓ లైన్‌మెన్ విధుల్లో చేరి పది రోజుల్లోనే తానిక్కడ పనిచేయలేనని చెప్పి వెళ్లిపోయాడు. ఇక కంభం రూరల్ పరిధిలో అగ్రికల్చర్‌కు రెగ్యులర్ లైన్‌మెన్ లేకపోవడంతో ఇతర లైన్‌మెన్లు రెండు నెలలకొకరు చొప్పున బాధ్యతలు చూస్తున్నారు. అయితే వారు ఎప్పుడు అందుబాటులో ఉంటారో ఎప్పుడు ఉండరో అర్థం కాక రైతులు అయోమయానికి గురవుతున్నారు.

ఆదాయం లేదనే..

కంభం చెరువు కింద ఇప్పటికే రైతులందరూ బోర్లు వేసుకున్నారు. అదే విధంగా జంగంగుంట్లలో సైతం రైతులు అవసరమైన మేర బోర్లు వేసుకొని వ్యవసాయం చేసుకుంటున్నారు. ఈ రెండు ప్రాంతాల్లో నూతనంగా బోర్లు వేసే వాళ్లు తక్కువగా ఉంటారు. ఇక్కడ పనిచేసే లైన్‌మెన్లు పాత బోర్లకు లైన్ల సమస్యలు వస్తే మరమ్మతులు చేయడం, లైన్లు సరిచూసుకోవడం వంటివి మాత్రమే చేయాల్సి ఉంటుంది. ఈ పనులకుగాను రైతుల నుంచి ఎటువంటి లబ్ధి ఉండదు. అదే కొత్త బోర్లు వేసుకుంటే లైన్‌మెన్లకు చేతినిండా పనితగిలి ఆదాయం కూడా వస్తుంది. ఈ నేపథ్యంలో ఆయా సబ్‌స్టేషన్ల పరిధిలో పనిచేసేందుకు ఎవరూ ఆసక్తి కనబరచకపోవడంతో తరచూ విద్యుత్ సమస్య తలెత్తుతోంది. చెరువు కింద ఉన్న అరటి తోటల్లో తక్కువ ఎత్తులో ఉన్న విద్యుత్ తీగలతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనన్న భయం రైతుల్లో నెలకొంది. జంగంగుంట్ల సబ్‌విద్యుత్ స్టేషన్ పరిధిలో చేరేందుకు ఏ ఒక్కరు ముందుకు రాకపోవడంతో అక్కడ నెలల తరబడి లైన్‌మన్ పోస్టు ఖాళీగా ఉంది. ఈ సబ్‌స్టేషన్ పరిధిలో వ్యవసాయ విద్యుత్ సమస్యలు అధికంగా ఉన్నాయి. గతంలో సూరేపల్లి రైతులు నిరసన కార్యక్రమాలు సైతం చేపట్టారు. ఈ రెండు చోట్లతో పాటు మిగిలిన గ్రామాల్లో ఖాళీగా ఉన్న లైన్‌మెన్ పోస్టులను వెంటనే భర్తీ చేసి రైతులకు ఇబ్బంది లేకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.



చెరువు కింద అరటి తోటల మీదుగా వెళ్తున్న విద్యుత్ లైన్



కంభం చెరువుకు వెళ్లే మార్గంలో ఒరిగిపోతున్న విద్యుత్ స్తంభాలు



జంగంగుంట్ల సబ్‌స్టేషన్ పరిధిలో లైన్‌మెన్‌ను నియమించి సమస్యలు పరిష్కరించాలని నిరసన తెలుపుతున్న రైతులు (ఫైల్)

> **సిబ్బంది కొరతతో సమస్య వస్తుంది**
>
> జంగంగుంట్ల, కంభం రూరల్ పరిధిలో అధికంగా వ్యవసాయ బోర్లు ఉన్నాయి. కంభం రూరల్‌లో రెండు నెలలకు ఒకరు చొప్పున, జంగంగుంట్లలో విధులు నిర్వహించేందుకు ఎవరూ ఆసక్తి చూపించడం లేదు. సిబ్బంది కొరత విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. త్వరలో సమస్యను పరిష్కరించేలా చూస్తాం.
>
> – నర్సయ్య, విద్యుత్ ఏఈ కంభం

సూపర్ సిక్స్ పథకాలు ఏవి బాబూ?



ప్రభపై మాట్లాడుతున్న అన్నా, ఉడుముల

- తల్లికి వందనం కింద రూ.15 వేలు ఎప్పుడిస్తారు?
- మాజీ ఎమ్మెల్యేలు అన్నా, ఉడుముల



ఉత్సాహంగా పాల్గొన్న కార్యకర్తలు

కొనకనమిట్ల: 'కూటమి అధికారంలోకి వస్తే ఇంట్లో ఎంత మంది ఉంటే అంత మంది పిల్లలకు రూ.15 వేలు ఇస్తామన్నారు కదా ఎంత మందికి ఇచ్చారు? సూపర్ సిక్స్ పథకాలు అంటూ మాయమాటలు, బూటకపు హామీలతో గద్దెనెక్కారు. పథకాలు ఎప్పుడు అమలు చేస్తారో ప్రజలకు స్పష్టత ఇవ్వండి' అని వైఎస్సార్ సీపీ మార్కాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి మాజీ ఎమ్మెల్యే అన్నా వెంకటరాంబాబు, పార్టీ సీనియర్ నేత, మాజీ ఎమ్మెల్యే ఉడుముల శ్రీనివాసులరెడ్డి విమర్శించారు. వెలుగొండ బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని శనివారం రాత్రి మండల వైఎస్సార్‌సీపీ నాయకులు ఏర్పాటు చేసిన విద్యుత్ ప్రభపై వారు మాట్లాడారు. వెలుగొండ వెంకటేశ్వరస్వామి ఆశీస్సులు జిల్లా ప్రజలకు ఎల్లవేళలా ఉండాలని ఆకాంక్షించారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అధికారంలోకి వచ్చి తొమ్మిది నెలలు దాటినా ఒక్క పథకం కూడా అమలు చేసిన పాపాన పోలేదని విమర్శించారు. జగనన్న పాలనలో సంక్షేమం, అభివృద్ధి పరుగులు పెడుతూ ప్రతిరోజూ పండగలాగే ఉండేదని గుర్తు చేశారు. ప్రభ ఏర్పాటు చేసిన మండల పార్టీ నాయకులను ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో ఎంపీపీ మోరబోయిన మురళీకృష్ణయాదవ్, జెడ్పీటీసీ అక్కిదాసరి ఏడుకొండలు, మండల పార్టీ కన్వీనర్ మోరా శంకర్‌రెడ్డి, ఆలయ కమిటీ మాజీ చైర్మన్ సానికొమ్ము తిరుపతిరెడ్డి, సొసైటీ మాజీ చైర్మన్లు కామసాని వెంకటేశ్వరరెడ్డి, ఉడుముల కాశిరెడ్డి, యూత్ నాయకులు సైకం రమణారెడ్డి, డి.ప్రసాద్‌రెడ్డి, కోనేటిరెడ్డి, సాదం వీరయ్య, బ్రహ్మారెడ్డి పాల్గొన్నారు.

మంచినీటి చలివేంద్రం ప్రారంభం



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న లయన్స్ క్లబ్ ప్రతినిధులు

మార్కాపురం: పట్టణంలోని నెహ్రూ బజారులో రాచపూడి పుల్లయ్య భవనం వద్ద లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మంచినీటి చలివేంద్రాన్ని క్లబ్ జిల్లా గవర్నర్ గోపిచంద్ ప్రారంభించారు. మార్కాపురం శాఖ చేస్తున్న సేవ కార్యక్రమాలను ఆయన అభినందించారు. ట్రాఫిక్ నిబంధనలపై ప్రజలు, వాహనదారులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రూపొందించిన బ్రోచర్‌ను ఆవిష్కరించారు. పలువురు పాదరక్షల తయారీదారులకు గొడుగులు అందించారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు టీవీ రామకృష్ణారావు, కోశాధికారి బీవీ రంగయ్య, వైస్ ప్రెసిడెంట్ హరనాధ్‌బాబు, భూపని కాశయ్య, వీవీ నరసింహారావు, కేవీ జగన్ బాబు, వీవీ సుబ్బయ్య, ఎస్.వెంకటేశ్వర్లు, రీజినల్ చైర్మన్ పులి శ్రీనివాసప్రసాద్ పాల్గొన్నారు.

అల్లూరి పోలేరమ్మ ఆలయానికి పోటెత్తిన భక్తులు



ప్రత్యేక అలంకరణలో అల్లూరి పోలేరమ్మ తల్లి

మార్కాపురం టౌన్: ఉగాది ఉత్సవాల సందర్భంగా ఆదివారం మార్కాపురం పట్టణ శివారులోని అల్లూరి పోలేరమ్మ దేవస్థానానికి భక్తులు పోటెత్తారు. చివరి ఆదివారం కావడంతో పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై మొక్కులు చెల్లించారు. ఏటా ఉగాది పండగకు ముందు నాలుగు ఆదివారాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఆలయ అర్చకులు వెంకటేశ్వర్లు, పవన్‌కుమార్ శర్మ అమ్మవారిని మూలవిగ్రహమూర్తిని ప్రత్యేకంగా అలంకరించి అభిషేకాలు, కుంకుమార్చన చేశారు. ఆలయ ఆవరణలోని పుట్ట, నాగశిలలకు భక్తులు పూజలు నిర్వహించారు. పొంగళ్లు పెట్టి అమ్మవారికి నైవేద్యంగా సమర్పించారు. ఆలయ ఈవో చెన్నకేశవరెడ్డి, సిబ్బంది ఏర్పాట్లను పర్యవేక్షించారు. అలాగే ఎస్‌వీకేపీ కళాశాల రోడ్డులోని పోలేరమ్మ ఆలయంలో భక్తులు పూజలు చేసి మొక్కులు చెల్లించారు.

ప్రమాదకరంగా మారిన రోడ్డు



సత్యవోలు సమీపంలో ప్రమాదకరంగా ఉన్న గుంత

రాచర్ల: మండల కేంద్రమైన రాచర్ల నుంచి సత్యవోలు గ్రామానికి వెళ్లే తారురోడ్డు ప్రమాదకరంగా మారింది. సత్యవోలు గ్రామ సమీపంలోని మూలమలుపు వద్ద తారు రోడ్డుపై భారీ గుంత ఏర్పాడటంతో వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ ప్రదేశంలో తరచూ ప్రమాదాలు సంభవిస్తున్నాయి. వ్యవసాయ పొలాలకు రాత్రి వేళ వెళ్లే సమయంలో పలువురు రైతులు గాయపడ్డారు. ఈ మార్గంలో భారీ వాహనాలు ప్రయాణిస్తే గుంత వద్ద ఇరుక్కుపోయే అవకాశం ఉంది. ఇప్పటికైనా సంబంధింత అధికారులు స్పందించి మరమ్మతులు చేయించాలని స్థానికులు కోరుతున్నారు.

అల్లాహ్ బోధనలు ఆచరణీయం



ఇఫ్తార్ విందులో ముస్లింలతో మాజీ ఎమ్మెల్యే అన్నా

- మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు

మార్కాపురం: పవిత్రమైన రంజాన్ మాసంలో ప్రతి ఒక్కరూ సంతోషంగా ఉండాలని మార్కాపురం వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు పేర్కొన్నారు. ఏపీ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ డాక్టర్ మీర్జా షంషేర్ అలీబేగ్ ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి ఏ1 గ్లోబల్ ఇంజినీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందుకు అన్నా రాంబాబు హాజరై మాట్లాడారు. ప్రతి ఒక్కరూ శాంతి, సహనం, ఓర్పు కలిగి ఉండాలని, తోటివారికి సాయం చేసే గుణాన్ని అలవర్చుకోవాలన్నారు. గత కొన్నేళ్లుగా షంషేర్ అలీబేగ్ ఇఫ్తార్ విందు ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే జంకె వెంకటరెడ్డి, మున్సిపల్ చైర్మన్ బాలమురళీకృష్ణ, తర్లుపాడు ఎంపీపీ భూలక్ష్మీ రామసుబ్బారెడ్డి, వైఎస్సార్ సీపీ బూత్ కమిటీ రాష్ట్ర సహాయ కార్యదర్శి పత్తి రవిచంద్ర, తర్లుపాడు మండల కన్వీనర్ మురారి వెంకటేశ్వర్లు, వాల్మీకి కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ నల్లబోతుల కొండయ్య, మాజీ ఎంపీపీ నాయక్, సీహెచ్ రమణారెడ్డి, బి.గురవయ్య, కళాశాల ఫౌండర్ ఉస్మాన్ బేగ్, డైరెక్టర్ మసూద్ ఆలీబేగ్, జాఫర్ బేగ్, ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీధర్, లయోల చెంచిరెడ్డి, మండల కోఆప్షన్ సభ్యులు మహమ్మద్ రఫీ, మైనార్టీ నాయకులు డాక్టర్ మగ్బుల్ బాషా, నజీర్ అహ్మద్, పీఎల్‌పీయాదవ్, అమీరుల్లాఖాన్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు స్వయంగా ముస్లింలకు భోజనం వడ్డించి శుభాకాంక్షలు తెలిపారు.

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న జనార్దన్‌రెడ్డి

గిద్దలూరు రూరల్: ఉద్యోగులకు రావాల్సిన కరువు భత్యం, జెడ్పీపీఎఫ్, ఏపీ జీఎల్ఐ క్లోజర్ లోన్స్, సరెండర్ లీవ్ బకాయిలు చెల్లించడంతోపాటు 12వ పీఆర్సీ కమిషన్ ఏర్పాటుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు వాకా జనార్దన్‌రెడ్డి కోరారు. సీపీఎస్‌ను రద్దు చేసి 2003 డీఎస్సీ ఉద్యోగులకు ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలన్నారు. పట్టణంలోని యాదవ బజారులో గల ఎంపీయూపీ స్కూల్ ఆవరణలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఇటీవల ఏపీటీఎఫ్ ప్రాంతీయ విద్యా సదస్సును విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. ఉపాధ్యాయ, ఉద్యోగుల సమస్యలు పరిష్కరించేందుకు ఏపీటీఎఫ్ పోరాడుతుందని చెప్పారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ నాయకులు సుబ్బారాయుడు, బి.శ్రీనివాసులు, బి.రవి, వెంకటరామిరెడ్డి, మూర్తయ్య, తదితరులు పాల్గొన్నారు.

మార్కాపురంలో ద్వాదశ జ్యోతిర్లింగాల దివ్య దర్శనం



ద్వాదశ జ్యోతిర్లింగాలను ప్రారంభిస్తున్న ఎన్‌వీ రమణ, సరస్వతి

మార్కాపురం: ఆధ్యాత్మిక చింతనతో ప్రతి ఒక్కరికీ మానసిక ప్రశాంతత లభిస్తుందని ఏపీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షుడు ఎన్‌వీ రమణ, బ్రహ్మకుమారి సరస్వతి పేర్కొన్నారు. మార్కాపురం పట్టణంలోని ఎస్ఎస్ నగర్‌లో బ్రహ్మకుమారీస్ ఈశ్వరీయ ప్రజాపిత ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ద్వాదశ జ్యోతిర్లింగాల దివ్య దర్శనం ప్రాంగణాన్ని వారు ప్రారంభించారు. ఈ నెల 26వ తేదీ వరకు ద్వాదశ జ్యోతిర్లింగాలను భక్తులు సందర్శించే అవకాశం కల్పించారు. ఆదివారం ఈశ్వరునికి రుద్రాభిషేకం, భక్తులకు ఆధ్యాత్మిక సందేశం, అనంతరం రాజయోగ మెడిటేషన్ తదితర కార్యక్రమాలు నిర్వహించారు. సోమవారం వాసవీ మహిళా కోలాట బృందంతో సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. కాగా పలువురు భక్తులు జ్యోతిర్లింగాలను దర్శించుకుని పూజలు చేశారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘ కోశాధికారి రామడుగు రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్మీ అధికారిపై పోలీసుల దాడి గర్హనీయం

- నిరసన ప్రదర్శనలో మాజీ సైనికులు



కందులాపురం కూడలిలో నిరసన తెలుపుతున్న మాజీ సైనికులు

కంభం: పంజాబ్‌లోని పటియాలాలో ఆర్మీ అధికారి కల్నల్ పుష్పీందర్ సింగ్ బాత్, ఆయన కుమారుడిపై ఈనెల 13న పోలీసులు దాడి చేయడాన్ని ఖండిస్తూ ఆదివారం సాయంత్రం ఆంధ్రప్రదేశ్ వాయిస్ అండ్ వెల్ఫేర్ ఎక్స్ సర్వీస్‌మెన్ అసోసియేషన్ కమిటీ ఆధ్వర్యంలో స్థానిక కందులాపురం కూడలిలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద మాజీ సైనికులు నిరసన కార్యక్రమం చేపట్టి సంఘీభావం తెలిపారు. దాడికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుని ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మండలంలోని మాజీ సైనికులు పాల్గొన్నారు.

పోలేరమ్మ తల్లి ఉత్సవాల్లో అన్నా, జంకె



పూజల అనంతరం భక్తులతో మాట్లాడుతున్న అన్నా రాంబాబు, జంకె

మార్కాపురం: మండలంలోని కోలభీమునిపాడు గ్రామంలో కొలువై ఉన్న పోలేరమ్మ తల్లి ద్వితీయ వార్షికోత్సవంలో ఆదివారం మార్కాపురం వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు, ఏపీఐఐసీ మాజీ చైర్మన్, మాజీ ఎమ్మెల్యే జంకె వెంకటరెడ్డి పాల్గొన్నారు. అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. వీరివెంట జెడ్పీటీసీ సభ్యుడు నారు బాపన్‌రెడ్డి, కుందురు వెంకటరెడ్డి, పోరెడ్డి చెంచిరెడ్డి, గొట్టిపడియ చెన్నారెడ్డి, గురుబ్రహ్మం, తుమ్మా వెంకటరెడ్డి, పలువురు పార్టీ నాయకులు ఉన్నారు.

ఏ1 గ్లోబల్ ఇంజినీరింగ్ విద్యార్థుల ప్రతిభ



విజేతలతో కళాశాల చైర్మన్ షంషేర్ ఆలీబేగ్

మార్కాపురం: స్థానిక జార్జి ఇంజినీరింగ్ కళాశాలలో ఇటీవల నిర్వహించిన జాతీయ స్థాయి ఎమర్జ్ 2025 పోటీల్లో ఏ1 గ్లోబల్ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచి ద్వితీయ బహుమతులు సాధించినట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీధర్ తెలిపారు. ఆదివారం కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో చైర్మన్ డాక్టర్ మీర్జా షంషేర్ ఆలీబేగ్ అభినందించారు. ఆప్టికల్ ఫైబర్ టెక్నాలజీపై ఈసీఈ బ్రాంచ్‌కు చెందిన తరుణ్, ప్రకాష్ బృందం పవర్‌పాయింట్ ప్రెజెంటేషన్ ఇచ్చి ద్వితీయ స్థానం సాధించినట్లు తెలిపారు. వీరిని కళాశాల డైరెక్టర్ మసూద్ ఆలీబేగ్, డీన్, హెచ్ఓడీలు అభినందించారు.

నేటి నుంచి అంగన్‌వాడీ కార్యకర్తలకు శిక్షణ

మార్కాపురం టౌన్: మార్కాపురం ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని అంగన్‌వాడీ కార్యకర్తలకు ఈనెల 24 నుంచి 26వ తేదీ వరకు కలుజువ్వలపాడు జెడ్పీ హైస్కూల్లో పోషణ్ భీ.. పఢాయీ భీపై శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు సీడీపీఓ సుశీలాదేవీ తెలిపారు. 3 రోజుల పాటు శిక్షణ తరగతులు కొనసాగుతాయని ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
మార్కాపురం డివిజన్
99516 02963 (మార్కాపురం)
99122 25435 (గిద్దలూరు)
Office mail : sakshiongads@gmail.com